ఈనాడు
హనుమకొండ
బుధవారం అక్టోబరు 2, 2024

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు


హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్‌లతో దూరదృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. కుటుంబ డిజిటల్ కార్డులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ, ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ డిజిటల్ కార్డుల కోసం వివరాలు సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



పూల పండగ.. మది నిండుగా..

విద్యా సంస్థలకు దసరా సెలవులు వచ్చాయి. ప్రకృతిని ఆరాధించే పూల పండగ బతుకమ్మ వేడుకలను మంగళవారమే పాఠశాలలు, కళాశాలల్లో వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులు సందడి చేశారు. మరిన్ని చిత్రాలు 9లో

మహాత్ముడి మాట.. పూలబాట!



ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

గ్రామాల అభివృద్ధి కోసం మహాత్ముడు కలలు కన్నారు.. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని తపించారు. గొప్ప వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచిన ఆయన బోధనలు బతుకమ్మ పండగలోనూ కనిపిస్తాయి.. బతుకమ్మ అంటే జీవిత పండగ అని అర్థం. నిత్యం పంటలతో సుభిక్షంగా ఉంటూ వేడుకలా సాగాలని పార్వతీదేవిని మహిళలు వేడుకుంటారు. గాంధీ కోరుకున్నది పల్లెలు పచ్చగా ఉండాలనే. అందుకే బతుకమ్మ పండగలో గాంధీ ఆశయాలు కనిపిస్తాయి. అక్టోబరు 2 గాంధీ జయంతి.. మరోవైపు వైభవంగా జరిగే బతుకమ్మ పండగ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మహాత్ముడి ఆశయ సాధనలో ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి పల్లెల గురించి కథనం..

ఆరుగుంటుపల్లి.. పారిశుద్ధ్యంలో ఆదర్శం

ఇంకుడుగుంతల నిర్మాణంలో ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఆరుగుంటుపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో 125 మంది జనాభా ఉండగా, 38 నివాసాలున్నాయి. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించుకోవడంతో.. గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి వేసవిలో కూడా నీటి సమస్య రాలేదని స్థానికులు చెబుతున్నారు. ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీవో భవాని గ్రామస్థులకు సహకరించడంతో పరిశుభ్రతలో, వందశాతం ఇంకుడు గుంతలు నిర్మించుకున్న గ్రామంగా ఆరుగుంటపల్లి నిలిచింది. –న్యూస్‌టుడే, వాజేడు





రాణా మెట్లెక్కని.. మెట్లతిమ్మాపురం

పది దశాబ్దాల చరిత్ర గల ఆదివాసీగూడెం.. సత్యం.. ధర్మం అనే గాంధీజీ సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ఊరిలో ఎవరి మధ్యనైనా గొడవ.. ఘర్షణ జరిగితే పరిష్కారం కోసం ఇప్పటి వరకు ఠాణా మెట్లెక్కలేదు. ఎలాంటి సమస్యలు వచ్చినా గ్రామంలోని పెద్దలు చర్చించి సామరస్యంగా పరిష్కరిస్తారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి 15 కి.మీ దూరంలోని అడవి మధ్యన ఉన్న **మెట్లతిమ్మాపురం** ప్రత్యేకత ఇది.. 130 కుటుంబాలు, 750 మంది జనాభా 412 మంది ఓట్లు కలిగిన ఈ గూడెం ప్రజల్లో కల్మషం, విద్వేషాలు ఏమాత్రం కనిపించవు. కలిసిమెలిసి జీవనం కొనసాగిస్తున్నారు. 'సమస్య పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా.. గ్రామ పెద్దల మధ్యనైనా ఎక్కడైనా జరిగేది న్యాయమే. అందుకే గ్రామ పరువును కాపాడుకునేందుకు స్టేషన్‌కు వెళ్లకుండా ఇరువర్గాల వారు తీర్పును మెచ్చేలా పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకుంటున్నాం. ఇది మా పూర్వీకుల నుంచి కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తాం అని ఊరి దొర బిజ్జ నర్సింహారావు, పటేల్ తాటి కృష్ణ వివరించారు.

● వ్యవసాయంపైనే ఆధారపడిన వీరు ఎక్కువగా వరి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేస్తారు. వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించుకున్నారు. మురుగునీరు వీధుల్లో పారకుండా ఇంటింటా ఇంకుడు గుంతలను నిర్మించుకుని స్వచ్ఛతలో శెభాష్ అనిపించుకుంటున్నారు.

● గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులున్నా ఎక్కడా ఏ పార్టీ జెండాలు, సూప్తాలు, విగ్రహాలు, ఫ్లెక్సీలు కనిపించవు. సుమారు 15 ఏళ్ల నుంచి మద్యపాన నిషేధం అమలు చేస్తున్నారు. అమ్మకాలు చేస్తే రూ.10 వేల జరిమానా విధిస్తున్నారు.

అన్నింట్లో ఆదర్శం

గూడెం ప్రజలు వేలిముద్రలు వేయకూడదనే ఉద్దేశంతో సుమారు 32 ఏళ్ల కిందటనే అప్పటి పెద్ద రామయ్య కనీసం వారందరూ పేర్లు రాసేలా.. బస్సుల పేర్లు తెలిసేలా అక్షరాలు నేర్పించారు. ఆ తర్వాత అక్షరదీపం కార్యక్రమం కింద రాత్రిబడిలో ప్రతి ఒక్కరూ అక్షరాలు నేర్చుకొని 2005లో నాటి భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రశంసలు పొందారు.

● గ్రామస్థుల కోసం అభయ, 100 స్మైల్ ఫౌండేషన్ సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేసినా కొత్తపుస్తకాలు ఇచ్చే వారు లేరు.

● డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజినీరింగ్ చదివినవారు 45 మంది వరకు ఉన్నారు. టీచర్లు 13 మంది ఉన్నా ఇందులో పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లిన అమ్మాయిలున్నారు. పోలీస్, అటవీ శాఖ ఉద్యోగులు నలుగురున్నారు. ఇందులో ఒకరు మహిళా రిజర్వుడు ఎస్ఐ ఉన్నారు.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, బయ్యారం

ఆ రెండు గ్రామాల్లో సంపూర్ణ మద్యనిషేధం


గంగదేవిపల్లి

గీసుకొండ: సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేస్తూ ఆ రెండు గ్రామాలు నిజం చేశాయి. అవే వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి, మరియపురం గ్రామాలు. గంగదేవిపల్లి ఇరవై ఏళ్ల క్రితమే జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎంపికవగా మరియపురం మూడేళ్ల కిందట ఆ స్థానం సంపాదించింది. గంగదేవిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూసం రాజమౌళి నేతృత్వంలో 40 ఏళ్ల కిందటే ఇక్కడి ప్రజలు సారాపై ఉద్యమించి విజయం సాధించారు.


మరియపురం

● గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం వల్లే జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. ఈ గ్రామానికి మరియపురం ఆనుకునే ఉంటుంది. గంగదేవిపల్లి ప్రభావం ఈ గ్రామం మీద కనిపిస్తుంది. నిర్మల బుక్ బైండింగ్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లం బాలిరెడ్డి 2019లో ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికైన తర్వాత గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు కదిలారు. సారాతోపాటు మద్యం గొలుసు దుకాణాలను అరికట్టి సంపూర్ణ మద్యనిషేధ గ్రామంగా తీర్చిదిద్దారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన నిధులను సద్వినియోగం చేసుకుని బాలిరెడ్డి లక్షలాది రుపాయలు సొంత నిధులను వెచ్చించి కేవలం ఐదేళ్లలోనే జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా నిలిపారు.

డీఎస్సీ జాబితాకు ఎదురుచూపులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ఫలితాలను ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు మంగళవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 187 పోస్టుల ఖాళీలకు 1:3 ప్రాతిపదికన 561 మంది అభ్యర్థులను హాజరుకావాలని అధికారులు సూచించారు. సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అభ్యర్థులు ఉదయం పదిగంటలకే చేరుకున్నారు. రాత్రి వరకు పడిగాపులు కాసినా రాష్ట్ర విద్యాశాఖ నుంచి జాబితా రాకపోవడంతో వెళ్లిపోయారు. జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించగా జాబితా వచ్చిన తదుపరి నిబంధనలతో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల చరవాణికే సమాచారం పంపించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం నుంచి ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు తెలిసింది.

కమిషనరేట్‌లో ఎస్సైల బదిలీలు

వరంగల్‌క్రైం : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ ఠాణాల్లో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌కే. హమ్మద్‌ను బచ్చన్నపేటకు, అక్కడి ఎస్సై కె.సతీష్‌ను ఐటీ కోర్, మిల్స్‌కాలనీ ఠాణా ఎస్‌బీ అటాచ్‌లో ఉన్న బి.చందర్‌ను వర్ధన్నపేటకు, అక్కడి ఎ.ప్రవీణ్‌కుమార్‌ను కేయూసీకి బదిలీ చేశారు.

డీజేలు నిషేధం

వరంగల్‌క్రైం : వరంగల్ నగరంలో డీజేలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. డీజే సౌండ్ సిస్టం నుంచి ఉత్పన్నమయ్యే అధిక డెసిబుల్స్ కారణంగా వృద్ధులు, పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఇకపై వివాహ వేడుకలు, ఊరేగింపుల్లో డీజేల వినియోగాన్ని నిషేధిస్తున్నామన్నారు. డీజే సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫైర్, బాణాసంచా ఉపయోగించడం కూడా నిషేధమని చెప్పారు. దీనిని ఎవరైన అతిక్రమిస్తే ఐదేళ్లు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

ఉత్సాహం.. అమ్మాయిలు అదరగొట్టారు!



హనుమకొండలోని కాకతీయ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినుల మధ్య స్నేహపూరిత వాతావారణం పెంపొందించడానికి మంగళవారం అంబేడ్కర్‌భవన్‌లో స్వాగతోత్సవం పేరిట 'మైత్రీమీట్' నిర్వహించారు. సీనియర్లు ఆటాపాటలతో అదరగొట్టారు. జూనియర్లు సైతం ఆయా ప్రదర్శనలతో మైమరపించారు. కళాశాల యజమాన్యం, ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఎన్జీవోస్‌కాలనీ

ఉపాయం.. ఈ గన్నుతో కోతులు పరార్



ప్రస్తుతం పట్టణాలు, గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. పంటలను కాపాడేందుకు రైతులు నానాకష్టాలు పడుతున్నారు. వాటి బెడద నివారించేందుకు మహారాష్ట్రకు చెందిన యువకుడు సంతోశ్ మంకీ గన్స్ తయారు చేసి, ఊరూరా తిరిగి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. పీవీసీ పైపులో కార్బైడ్‌తో పాటు రెండు నీటి చుక్కలు వేయాలని, పైపు కింది భాగంలో గ్యాస్ పొయ్యి వెలిగించే లైటర్‌తో కొట్టగానే పెద్ద శబ్దంతో పేలి కోతులు పారిపోతాయని చెప్పారు. ములుకనూరులో విక్రయిస్తుండగా కొనుగోలు చేయడానికి గ్రామస్థులు ఆసక్తి చూపారు.

– న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

పండగ పనులు పంచేసుకున్నారు!

ఉత్సవాలకు సుమారు రూ.కోటి పైనే ఖర్చు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'పనుల అంచనా ధర పెంచుకో.. పర్సంటేజీలు దండుకో' అన్నట్లుగా ఉంది గ్రేటర్ వరంగల్ ఇంజినీర్ల తీరు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్ల పనుల ప్రతిపాదనలు అడ్డగోలుగా పెంచేశారు. గతేడాది కంటే 40-50 శాతం పెరగడం గమనార్హం. అంతటితో ఆగకుండా ఆ పనులను తమకు ఇష్టమైన వారికి అప్పగిస్తున్నారు. రాజకీయ సిఫార్సులు, ఇంజినీరింగ్ అధికారులకు దగ్గరగా ఉండే గుత్తేదారులకు నామినేషన్‌పై పనులు కేయిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

నగరంలోని 66 డివిజన్లలో అమావాస్య, సద్దుల బతుకమ్మ ఆడే చెరువులు, కుంటలు, మైదానాల వద్ద తాత్కాలిక పనులు, విద్యుద్దీపాల అలంకరణ ఇతర పనుల కోసం ఈ ఏడాది సుమారు రూ.కోటి పైనే ఖర్చు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇంజినీరింగ్ సివిల్, ఎలక్ట్రికల్ లైటింగ్ పనులకు టెండర్లు నిర్వహించకుండా.. పనులు నామినేషన్‌పై కేటాయించడం వెనుక పెద్దఎత్తున కమీషన్లు చేతులు మారుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ఇంజినీరింగ్ అధికారి కనుసన్నల్లో పనుల పంపకాలు జరుగుతున్నాయని తెలిసింది.

నక్కలగుట్ట సర్కిల్‌లో 10...

● హనుమకొండ నక్కలగుట్ట సర్కిల్-3 పరిధిలో రూ.26.77 లక్షలతో ప్రతిపాదించిన 10 పనులకు టెండర్లు నిర్వహించకుండా.. నామినేషన్‌పై కేటాయించారు. అదే బహిరంగ టెండర్లు పిలిచి ఉంటే 15-20 శాతం తగ్గించేవారు. ప్రజాధనం ఆదా చేయాల్సిన ఇంజినీరింగ్ అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. గతేడాది రూ.16.27 లక్షలు ఖర్చు పెడితే ఈసారి రూ.26.77 లక్షలకు పెంచారు.

● 1వ డివిజన్‌లో రూ.1.30 లక్షలు, 2లో రూ.1.20 లక్షలు, 4లో రూ.లక్ష, 5లో రూ.లక్ష, 11లో రూ.4.98 లక్షలు, 52, 54లో రూ.4.10 లక్షలు, 55లో రూ.3.50 లక్షలు, 56లో రూ.4.20 లక్షలు, 65లో రూ.4.50 లక్షలు, 66వ డివిజన్‌లో రూ.లక్ష చొప్పున పనులకు టెండర్లు పిలవకుండా నామినేషన్‌పై కేటాయించారు.

● వరంగల్ కాశీబుగ్గ సర్కిల్ పరిధిలో, ఎలక్ట్రికల్ పనులు ఎవరికి కేటాయించారో తెలియకుండా ఇంజినీర్లు గోప్యత పాటిస్తున్నారు. రాజకీయ పైరవీలతో నచ్చిన గుత్తేదారులకు నామినేషన్ పనులు కట్టబెట్టడం విమర్శలకు తావిస్తోంది.

రాష్ట్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


నేతలతో సమీక్షలో పాల్గొన్న మంత్రి పొంగులేటి

ఈనాడు, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. ఓరుగల్లులో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. తాజాగా భారాస, కాంగ్రెస్ శ్రేణుల మధ్య హనుమకొండలో జరిగిన తోపులాట అంశాన్ని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పొంగులేటికి వివరించినట్లు సమాచారం. వరంగల్ ఎంపీలు బలరాం నాయక్, కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఉద్యోగాలు సాధించి.. స్ఫూర్తిగా నిలిచి


సునీల్ కుమార్

పరకాల రూరల్, న్యూస్‌టుడే: నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన బోడ సునీల్ కుమార్. సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో సునీల్ కుమార్ గణిత శాస్త్ర విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. 2019-20లో పంచాయతీ జూనియర్ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి రాయపర్తి మండలంలో విధులు నిర్వహించారు. తర్వాత గ్రూప్ -4 రాసి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ పరిధిలో మూడేళ్లు సీసీగా విధులు నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తి ధ్యేయంగా 2023లో టీజీటీ గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. తనకు అన్న బోడ అనిల్ కుమార్ స్ఫూర్తి అంటారు సునీల్‌కుమార్. 'అన్నయ్య ఇంటర్ చదువుతున్న సమయంలోనే తండ్రి మరణించారు. అయినా చదువు మధ్యలో ఆపకుండా పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. నాన్న లేని లోటు తీర్చి నన్ను ముందుండి నడిపించారు'. అని సునీల్ కుమార్ పేర్కొన్నారు.

జిల్లా కోర్టులో స్వచ్ఛతకు శ్రీకారం



'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా కోర్టు ఆవరణ శుభ్రం చేస్తున్న హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణాదేవి, ఇతర న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది

– న్యూస్‌టుడే, వరంగల్ న్యాయ విభాగం

పదవి కోసం పోటాపోటీ.. కార్యకర్తల్లో అసంతృప్తి

ఐనవోలు, న్యూస్‌టుడే: తమ పార్టీ నేత ఎమ్మెల్యే అయ్యారు.. ఇంకేముంది ఐదేళ్ల పాటు తమదే ఆధిపత్యం అని భావించిన మండల కాంగ్రెస్ నేతల ఆశలు సన్నగిల్లుతున్నాయి. పాత, కొత్త కాంగ్రెస్ నేతలుగా చెప్పుకొంటూ ఎవరికి వారు సొంతంగా కార్యక్రమాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేకు దగ్గరగా ఉండాలని పోటీపడుతున్నారు. పార్టీ కష్టకాలంలో ఉనికిని కోల్పోకుండా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేసిన నేతలు ఒకవైపు, అధికారం వచ్చాక పార్టీలో చేరిన నేతలు మరోవైపు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. రెండు వర్గాలుగా చేరి ఒకే కార్యక్రమాన్ని వేర్వేరుగా చేపడుతున్నారు. వర్ధన్నపేట మండలానికి చెందిన ఓనేతకు ఛైర్మన్ పదవి ఇస్తున్నట్లు చర్చనీయాంశమైంది. దీంతో మండల నాయకులు తమ మండల నేతలకే మల్లన్న ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిని కేటాయించాలని ఎమ్మెల్యేను ఇరుకున పెట్టారు. దీంతో ధర్మకర్తల మండలి ఎంపికలో జాప్యం జరిగింది. గత నెల 22తో గడువు కాలం ముగిసింది. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొంది. పాత కాంగ్రెస్ వర్గం ఓ రాష్ట్రస్థాయి నాయకుడి ఎదుట, కొత్త వర్గం మరో నాయకుడి వద్ద తమ అభిప్రాయాలు వెల్లడించినట్లు సమాచారం. మరో రెండు నెలల్లో ఐనవోలు మల్లన్న జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కమిటీ ఎంపికను నిలిపివేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

తీర్పు వెలువడే వరకూ ట్రస్టుబోర్డు నియామకం కష్టమే?

2025 జాతర ధర్మకర్తల మండలిలో పనిచేయాలని ఎదురుచూస్తున్న నేతలకు నిరాశే ఎదురవుతోంది. గత భారాస ప్రభుత్వంలో 2023 జనవరి 10 తేదీన ఐనవోలు మల్లికార్జునస్వామి ధర్మకర్తల మండలిని దేవాదయ శాఖ అధికారింగా ప్రకటించింది. పైళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి ధర్మకర్తల నియామకంలో అవకతవకలు ఉన్నాయని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ట్రస్టుబోర్డు ఎంపికపై కోర్టు స్టే విధించింది. కౌంటర్ దాఖలు చేయడంతో తీర్పు వెలువడలేదు. ప్రస్తుతం కోర్టులో కేసు కొనసాగుతోంది. మరోవైపు ఆగస్టు 30న దేవాదయ శాఖ నూతన ధర్మకర్త మండలి ఎంపికకు దరఖాస్తులకు ఆహ్వానించింది. దీంతో గతేడాది ఎంపికైన పాలకవర్గం దేవాదయశాఖ కమిషనర్‌ను కలిసి కోర్టులో కేసు కొనసాగుతున్నప్పటికీ నూతన పాలకవర్గం దరఖాస్తుకు జీవో జారీ చేయడం సరికాదని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఎంపిక చేపడితే కోర్టు నుంచి సవాల్ చేస్తామని తెలియజేశారు. ఎమ్మెల్యే తీర్పు వెలువడే వరకూ ఎంపికను వాయిదా వేయాలని భావించినట్లు తెలిసింది. లేదా.. ఉత్సవ కమిటీని ఎంపిక చేసి జాతరలో సేవలందించేలా ఎమ్మెల్యే చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇది తెలియక కాంగ్రెస్ నేతలు నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేయడం సరికాదని కొంతమంది నాయకులు కార్యకర్తలను బుజ్జగిస్తున్నారు.

బతుకమ్మ పండగ వచ్చిందంటే ఆడపడుచులు వారి తల్లిగారింటికి బయలుదేరుతారు. పాఠశాలలకు మంగళవారం నుంచి సెలవులు ప్రకటించడంతో పిల్లలతో ఎంత కష్టమైనా సొంతింటికి వెళతారు. ఓరుగల్లు ప్రజలు ఎక్కువగారైళ్లలో ప్రయాణిస్తారు. ఈసారి పండగకు విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మూడోలైను పనుల కారణంగా వరంగల్, కాజీపేట నుంచి వెళ్లే రైళ్లను ఈ నెల 7 వరకు రద్దు చేశారు. ప్రత్యేక రైళ్లను ప్రకటించినా వాటిలో చాలా వరకు రద్దయ్యాయి. దీంతో అందరూ బస్సులనే ఆశ్రయించాల్సి వస్తోంది. బతుకమ్మ, దసరా పండగకు వరంగల్ ఆర్టీసీ అదనపు బస్సులను మంగళవారం నుంచి నడిపిస్తోంది. రైలు ప్రయాణికులంతా వాటినే ఆశ్రయిస్తారు కాబట్టి రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో కొందరు సొంత వాహనాల్లో పయనం కావడానికి సిద్ధమవుతున్నారు. చౌకగా ప్రయాణం చేసే రైళ్లు రద్దు కావడం అందరికీ భారంగా మారింది..

–కాజీపేట, హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

పండగ వేళ.. ప్రయాణం భారం!

రైళ్ల రద్దు.. బస్సుల్లో రద్దీ



రైళ్లు రద్దు కావడంతో వెల వెల పోతున్న కాజీపేట రైల్వే స్టేషన్

బస్సు	ఛార్జీల వివరాలు (రూ.)	రైలు
300	వరంగల్-హైదరాబాదుకు	80
275	వరంగల్-ఖమ్మం	75
250	వరంగల్-రామగుండం	70



ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్





అదనపు భారం రూ.2 వేలు

రైళ్లు లేకపోవడంతో ఈసారి బస్సు ప్రయాణం తప్పదు. వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నా రద్దీని తట్టుకోవడం కష్టం. దీంతో ఛార్జీలు అధికంగా ఉండే డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి ఉన్నత స్థాయి బస్సులను ఆశ్రయించాల్సిందే. వాటిలోనూ సీట్లు దొరకడం కష్టం.

ఇదీ పరిస్థితి: ఇంట్లో నలుగురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణం చేయాలనుకుంటే రైలు ఛార్జీతో పోలిస్తే ఒక్కొక్కరికి బస్సులో రూ.200 నుంచి రూ.225 వరకు ఎక్కువ అవుతుంది. దీనికి తోడు ఆటోలు, ఇతర రవాణా ఛార్జీలు కలుపుకొని కుటుంబానికి రానుపోను రూ.2000 వరకు అదనపు భారం పడుతుంది.

ముందస్తు ప్రయాణం మేలు

పండగకు ముందురోజు కంటే ఒకటి, రెండు రోజుల ముందే ప్రయాణం కడితే కొంత రద్దీని తట్టుకోవచ్చు. చాలా మంది సాయంత్రం విధులు ముగించాక బయలుదేరుతారు. కాస్త ముందుగా బయలుదేరితే ఆర్టీసీకి కాస్త వెసులుబాటు లభిస్తుంది.

● ఇప్పుడు చాలా మందికి కార్లు ఉంటున్నాయి. కాబట్టి కాస్త ఖర్చు ఎక్కువైనా కారు లేదా ఇతర వాహనాలు వాడితే సామాన్య ప్రజలకు బస్సుల్లో కాస్త వెసులుబాటు ఉంటుంది.

త్రిప్పుల సంఖ్య పెంచాలి..

-మాడిశెట్టి చంద్రశేఖర్, హనుమకొండ



గతంలో రైళ్లలో ప్రయాణించేవాళ్లం.. ఈసారి అవి రద్దయ్యాయి. దీనితో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంది. రైళ్లు నడిచే మార్గంలో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా నడిపించాలి. ట్రిప్పుల సంఖ్య పెంచాలి. రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలి.

అదనపు భారం

-గద్దల సతీష్, ప్రయాణికుడు



మా స్వగ్రామం మంచిర్యాల దేవనూరు. మా బంధువులు అంతా అక్కడే ఉంటారు. మేము హనుమకొండకు వచ్చి దాదాపు 15 ఏళ్లు అవుతోంది. అప్పుడప్పుడు మా గ్రామానికి వెళ్లి వస్తుంటాం. ఈ ఏడాది దసరాకు వెళ్దామని అన్నీ సిద్ధం చేసుకున్నాం. ఇంతలోనే రైళ్లు రద్దు అని చెబుతున్నారు. బస్సులో వెళ్తే ప్రయాణ భారంతో పాటు సమయం ఎక్కువగా తీసుకుంటుంది. ఈ సమయంలో రైళ్లు రద్దు చేయడం సరికాదు.. పండగలు ముగిసిన తర్వాత ఆ నిర్ణయం తీసుకుంటే బాగుండేది

బల్లార్ష మార్గంలో బహుకష్టం

బల్లార్ష మార్గంలో పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాలకు వెళ్లడానికి రైలు మార్గమే సులువు.. చౌకగా వెళ్లొచ్చు. రైళ్లు రద్దు చేయడంతో కరీంనగర్ మీదుగా బస్సులో వ్యయ ప్రయాసలతో ప్రయాణించాల్సిందే.

నిండిన బెర్తులు: దసరా పండగకు కోల్‌కతా, ఒడిశా, బెంగళూరు, మైసూరు, తిరుపతి ప్రాంతాలకు ఎక్కువగా వెళుతుంటారు. ఈమార్గంలో రైళ్లకు చాంతాండంత వెయిటింగ్ లిస్టు ఉంది. హౌరా, యశ్వంతపూర్, పద్మావతి రైళ్లల్లో బెర్తులు లేవని చూపిస్తున్నాయి.

గతేడాది అక్టోబరులో దసరా, బతుకమ్మ పండగ నేపథ్యంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణించినవారి సంఖ్య (రోజుకు సగటున)

మార్గం	ప్రయాణికుల సంఖ్య	సాధారణ రోజుల్లో ప్రయాణికుల సంఖ్య	తేడా
వరంగల్-కాజీపేట- సికింద్రాబాద్	16,000	9,500	6,500
కాజీపేట-వరంగల్- ఖమ్మం	13,000	8,500	4,500
కాజీపేట - వరంగల్- బల్లార్ష	15,000	6,500	7,500

ప్రైవేటు వాహనాలకు గిరాకీ



ప్రైవేటు వాహనాలకు గిరాకీ బాగా పెరిగింది. ఇప్పటికే వరంగల్‌లోని ట్రావెల్స్‌ల్లో ఉన్న నాలుగు చక్రాల వాహనాలు బతుకమ్మకు ముందు రోజున బుక్ అయ్యాయి. డిమాండ్ పెరగడంతో ఆ రోజు ప్రయాణానికి అదనంగా వసూలు చేయనున్నారు.

నేటి నుంచి 850 అదనపు బస్సులు..

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: వరంగల్ రీజియన్‌లో 850 బస్సులను (ట్రిప్పులు) నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఎక్కువగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలకు తిరుగుతాయి. దూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులను ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 2 నుంచి 8 వరకు ఇవి నడుస్తాయి. పండగ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా 13, 14, 15 తేదీల్లో రద్దీకి అనుగుణంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు సైతం బస్సులు నడపనున్నారు. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉండటంతో గతేడాది కంటే అదనంగా బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు.

● హనుమకొండ బస్టాండు నుంచి హైదరాబాద్ రూట్లో నిత్యం 250 బస్సులు నడుస్తుంటాయి..దాదాపు 400 ట్రిప్పులు. పండగ సందర్భంగా అదనంగా 150 బస్సులు నడిపిస్తారు.. ● ఖమ్మం, మహబూబాబాద్ రూట్లలో వరంగల్ రీజియన్ నుంచి హనుమకొండ, మహబూబాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నడుస్తాయి. 25 బస్సులు ఖమ్మం వరకు ఉంటాయి. మహబూబాబాద్ నుంచి ఖమ్మం వరకు మరికొన్ని బస్సులు నిత్యం నడుస్తాయి. ఈ మార్గంలో అదనంగా మరో 50 బస్సులను పెంచనున్నారు.

డిపోల వారీగా నడిపే ప్రత్యేక బస్సులు

వరంగల్-1	125
వరంగల్-2	125
హనుమకొండ	125
పరకాల	93
నర్సంపేట	119
జనగామ	120
తొర్రూరు	48
మహబూబాబాద్	47
భూపాలపల్లి	48

రేపటి నుంచి శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు

● 10న సద్దుల బతుకమ్మ.. 12న దసరా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కార్యనిర్వహణ అధికారిణి శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు వెల్లడించారు. 10న మహానవి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి జన్మోత్సవం, సద్దుల బతుకమ్మ, 12న విజయదశమి(దసరా) ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. శ్రీదేవి శరన్నవరాత్రులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని, తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అమ్మవారిని సుందరంగా అలంకరిస్తారని, ఉదయం, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులకు వాహన సేవలుంటాయన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, చింత శ్యాంసుందర్, అర్చకుడు గండికోట రాము తదితరులు పాల్గొన్నారు.

రోజు వారీగా కార్యక్రమాలు..

● 2న ఉదయం హరిద్రాదర్శనం శరన్నవరాత్రయాగ పూర్వాంగనిధి, సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ
● 3న భేరి పూజ, ధ్వజారోహణం, కలశ స్థాపన, అమ్మవారిని శైలపుత్రిక్రమము బాలా త్రిపురసుందరి అలంకరణ, ఉదయం 11 గంటలకు వృషభ వాహనసేవ, సాయంత్రం మృగ(జింక) వాహనసేవ
● 4న అన్నపూర్ణాలంకారం, బ్రహ్మచారిణి దుర్గార్చన, మకర, చంద్రప్రభ వాహనసేవలు
● 5న గాయత్రి అలంకరణ, చంద్రఘంటా దుర్గార్చన, సింహ, గజ వాహనసేవలు
● 6న శ్రీమహాలక్ష్మి అలంకరణ, కూష్మాండీ దుర్గార్చన, సూర్యప్రభ, హంస వాహనసేవలు
● 7న లలితా పంచమి శ్రీరాజరాజేశ్వరి లలితా మహాత్రిపుర సుందరి, స్కందామాత దుర్గార్చన, పల్లకీ సేవ, శేషవాహనసేవ
● 8న భవాని అలంకరణ, కాత్యాయని దుర్గార్చన, గంధోత్సవం, చాముండ దుర్గార్చన, సాలభంజిక సేవ
● 9న శ్రీ సరస్వతీమాత, కాళరాత్రి దుర్గార్చన, రాత్రి అమ్మవారికి రథోత్సవం
● 10న మహాష్టమి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, మహా దుర్గా అలంకారం, మహా గౌరి దుర్గార్చన, భద్రపీఠ సేవ, అశ్వవాహన సేవ, సద్దుల బతుకమ్మ
● 11న మహా నవమి మహిషమర్దిని అలంకరణ, శుంభు దుర్గార్చన, వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, సాయంత్రం సర్వభూపాల వాహనసేవ
● 12న విజయ దశమి, శమీ పూజ, శ్రీభద్రకాళి అమ్మవారికి మహా పట్టాభిషేకం, నిజరూప దర్శనం, రాత్రి భద్రకాళి చెరువు(తటాకంలో)లో శ్రీభద్రకాళి భద్రేశ్వరులకు తెప్పోత్సవం
● 13న సాయంత్రం శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం.

రూపుదిద్దుకుంటున్న కాజీపేట వంతెన

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

కాజీపేట వద్ద నిర్మాణంలో ఉన్న రెండో ఆర్వోబీపై బిగించేందుకు ఉక్కుతో తయారు చేస్తున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో సిద్ధమవుతోంది. నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనెలాఖరుకు విడిభాగాలు ఇక్కడకు తీసుకొస్తారు. విల్లు ఆకారంలో ఉక్కుతో ఉన్న ఈ భాగాన్ని రైల్వే పట్టాలపై నిపుణులు బిగించనున్నారు. రాష్ట్రంలో ఇలాంటి తరహా వంతెన ఇప్పటి వరకు ఎక్కడా లేదని.. కాజీపేటపై రెండో ఆర్వోబీపై వచ్చేది మొదటిది అని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

మరో రూ.16 కోట్లు విడుదల చేయాలి

ఈ వంతెనను వేంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ అనే గుత్తేదారు సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థకు ప్రభుత్వం ఇంకా రూ.16 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమీక్షించి ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా నిధులు ఇంకా గుత్తేదారుకు అందలేదని, అందుకే వంతెన నిర్మాణం నిలిచిపోయినట్టు సమాచారం. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి నిధులను వెంటనే విడుదల చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయి.

● రాయ్‌పూర్‌లో సిద్ధమవుతున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

- శంకుస్థాపన - 2017
- టెండర్లు పిలిచింది - 2019
- పూర్తి కావాల్సింది - 2020
- పనులు ప్రారంభమైంది - 2021
- మొత్తం అంచనా వ్యయం - రూ.45 కోట్లు
- 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగం నిర్మాణానికి - రూ.20 కోట్లు
- వెడల్పు - 9.5 మీటర్లు
- ఎడమవైపు పాదచారుల దారి - 1.5 మీటర్లు.



తయారీ దశలో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

విల్లు ఆకారమే ప్రత్యేకం

కాజీపేటలో ఉన్న పాత ఆర్వోబీకి కొత్త వంతెన పూర్తి భిన్నంగా ఉంటుంది. దీన్ని 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' గా పిలుస్తారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైళ్ల రాకపోకలకు ఏమాత్రం అంతరాయం లేకుండా వంతెన నిర్మాణాన్ని కొనసాగించేందుకు ముందే సిద్ధం చేసిన 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'ను వంతెనపై బిగించనున్నారు. వంతెనను 21 స్తంభాలతో నిర్మిస్తుండగా, ఇందులో రైల్వే లైన్ల పైభాగంలో మాత్రం విల్లు ఆకారంలో ఉండే నిర్మాణం మొత్తం ఉక్కు మిశ్రమంతో ఉంటుంది. దీనికి ఆధారంగా మూడు పిల్లర్లు ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. రైల్వే పట్టాలపై 800 టన్నుల బరువుతో 250 అడుగుల పొడవుతో రెండు భాగాలు ఉంటాయి. అంటే మొత్తం 1600 టన్నుల బరువు, 500 అడుగుల పొడవుతో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగాలను రాయ్‌పూర్‌లో సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే మన ఇంజినీర్లు అక్కడికి వెళ్లి దాన్ని పరిశీలించారు. 'ఈనాడు' ఆ చిత్రాలను ప్రత్యేకంగా సంపాదించింది. ప్రస్తుతం ఉన్న వంతెన కన్నా కొత్త వంతెన ఎక్కువ ఎత్తుతో ఉండనుంది.



కేయూలో విజిలెన్స్ విచారణ



కేయూ అధికారులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యానగర్,న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి టి.రమేష్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ఎ.బాలకోటి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు జి.రాకేష్, బి.అనిల్, హస్సన్, ఎఫ్ఆర్ఓ గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు కేయూకు వచ్చారు. రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, పరీక్షల నియంత్రణ అధికారులను విచారించారు. ప్రొఫెసర్లను సీనియర్ ప్రొఫెసర్లుగా ఏ విధంగా పదోన్నతి కల్పించారు.. సెలక్షన్ కమిటీ ఆమోద పత్రాలు, ఈసీ మినిట్స్, 2022లో పీహెచ్‌డీ ప్రవేశాలు ఎలా భర్తీ చేశారు.. తదితర అంశాలపై విచారించి, వాటికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడిగిన వివిధ పత్రాలు సమర్పించడంలో వర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రెండు మూడు సార్లు నోటీసులు పంపించినా వాటికి ఎలాంటి సమాధానాలు రాక పోవడంతోనే నేరుగా విచారణకు వచ్చినట్లు సమాచారం.

భారీ బతుకమ్మకు అంతర్జాతీయ రికార్డు



జనగామలోని నెహ్రూపార్కు సెయింట్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో 36.2 అడుగుల భారీ బతుకమ్మ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఉన్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. సంబరాల్లో భాగంగా 36.2 అడుగుల బతుకమ్మను తయారు చేసి ప్రపంచంలోకెల్లా అతిపెద్ద బతుకమ్మగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించుకుంది. స్టీల్, వైబ్రెంట్ ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్‌తో 700 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు కలిసి 24 గంటలలోపు దీన్ని తయారు చేశారు. ఇంతకు ముందు ఉన్న 31 అడుగుల బతుకమ్మ రికార్డును అధిగమించినందున ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులు నరేందర్‌గౌడ్, సుభాషిని.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసాని శ్రీధర్‌కు సదరు రికార్డు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువీకరణపత్రం

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

నఖ చిత్ర కళలో దిట్ట



దళసరి కాగితాలే క్యాన్వాస్‌గా వేలి గోర్లే కుంచెగా చేసుకుని అద్భుత కళాఖండాలు చిత్రీకరిస్తూ అబ్బురపరుస్తున్నారు నర్సంపేటకు చెందిన కళాకారుడు మండ వీరస్వామి. కవి, గేయరచయిత, గాయకుడు, చిత్రకారుడు, రంగస్థల నటుడిగానే గాక చిత్రలేఖనంలో చేయి తిరిగిన చిత్రకారుడు కూడా. చిత్రలేఖనంలో పట్టున్న ఆయన దళసరి కాగితాలపై నఖ(గోటి)తో మహాత్మాగాంధీ, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం, మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు తదితరుల చిత్రాలు గీసి అబ్బురపరుస్తున్నారు. –న్యూస్‌టుడే, నర్సంపేట

5న ఉద్యోగ మేళా

కొత్తవాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న వరంగల్ ములుగురోడ్డులోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో చెన్నైలోని హిందూస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్‌లో 100 ఉద్యోగ ఖాళీలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. ఇంటర్‌లో 75శాతం మార్కులు వచ్చి, 18 నుంచి 22 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 75691 77071 సంప్రదించాలన్నారు.

చారిత్రక ప్రాంతాల సందర్శనే లక్ష్యం



బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ జీఎం కిషోర్, ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగర్ తదితరులు

కాజీపేట, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులకు చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శింపజేయడమే లక్ష్యంగా ఐఆర్‌సీటీసీ పని చేస్తుందని సంస్థ జనరల్ మేనేజర్ కిషోర్, టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం భారత్ గౌరవ్ యాత్ర ప్రత్యేక పర్యాటక రైలుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. స్థానిక టూరిజం ఏజెంట్లకు దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత్ గౌరవ్ యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుందని చెప్పారు. నవంబరు 6న సికింద్రాబాద్ నుంచి ఈ రైలు ప్రారంభమౌతుందని తెలిపారు. ఈ యాత్రలో రామేశ్వరం, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు తదితర సందర్శన ప్రదేశాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న ప్రయాణికులు వివరాలకు 92810 30749, 92810 30750 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బతుకమ్మ సంబరాలు

జిల్లా అంతటా మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అన్ని విద్యాసంస్థల్లో బతుకమ్మలను అలంకరించి ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఆడిపాడారు.


సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో..


సుబేదారి ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు


సుజాత విద్యానికేతన్ పాఠశాలలో..


కొత్తపేటలోని ఎస్ఎస్ఆర్ పాఠశాలలో..


ఆర్బిట్ ఈ-టెక్నో పాఠశాలలో..


శ్రీనివాస గురుకులంలో చిన్నారుల సందడి..


తాళ్ల పద్మావతి ఒలింపియాడ్‌లో..


కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ పాఠశాలలో..


ఇంజినీరింగ్ కళాశాలలో..


సెయింట్ మాథ్యూస్ పాఠశాలలో..


మడికొండ ఏకశిల పాఠశాలలో..


సుబేదారి ఉన్నత పాఠశాలలో..


రెడ్డికాలనీలోని ఏకశిల కాన్సెప్ట్ స్కూల్‌లో..


కిషన్‌పురలోని మాస్టార్జీ బాలికల ఉన్నత పాఠశాలలో..


భవానీనగర్‌లోని సన్‌షైన్ ప్లేవే పాఠశాలలో..


పరకాల శారదా విద్యాలయంలో..


అక్కంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) జులైవాడ 9059585150 బాలసముద్రం 81438 11118 పరకాల 9849211303

సుబేదారి, న్యూస్‌టుడే: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ప్రధాన కాలువలో వ్యర్థాలు చేరి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - **సుధాకర్, హౌసింగ్‌బోర్డుకాలనీ**

సమాధానం: పరిశీలించి శుభ్రం చేయిస్తాం. - **భాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఎల్కతుర్తి: ఎల్కతుర్తిలోని పలు వీధుల్లో దీపాలు వెలగడం లేదు. సుమారు 20 రోజుల నుంచి అంధకారం అలుముకొని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - **వి.సమ్మయ్య, ఎల్కతుర్తి**

సమాధానం: వెలగని దీపాలు గుర్తించి కొత్తవి ఏర్పాటు చేస్తాం. - **శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

సుబేదారి, న్యూస్‌టుడే: నగరంలోని వడ్డేపల్లి పింగిలి కళాశాల ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ అంధకారంగా ఉంటుంది. - **అశోక్, వడ్డేపల్లి**

సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. - **సరిత, ఏఈ, నగరపాలక సంస్థ**

'మీ నిజస్వరూపం బయటపెడితే పార్టీ బహిష్కరణే'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నయీంనగర్, న్యూస్‌టుడే: 'వినయ్‌భాస్కర్‌ను నిర్బంధించాలనుకుంటే పార్టీ కార్యాలయం నుంచి అడుగు బయట పెట్టలేరు. ఆయన నిజ స్వరూపం భారాస అధినేతలకు తెలిస్తే పార్టీ నుంచి బహిష్కరించడం ఖాయమ'ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినయ్‌భాస్కర్ కబ్జాల బాగోతం బయటపెడతానని, హనుమకొండ మునిగిపోవడానికి ఆయనే కారణమని పేర్కొన్నారు. నయీంనగర్ నాలా కట్టినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నయీంనగర్ నాలా, కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి మాడవీధుల గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు పూర్తి చేయించామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వస్తే కార్పొరేటర్ టికెట్ ఇస్తానని ఎద్దేవా చేశారు. నాలాపై రాకేష్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మ, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

'నా వ్యాఖ్యలను రాజకీయం చేయడం తగదు'

ఐనవోలు, న్యూస్‌టుడే: తన వ్యాఖ్యలను కొందరు పనిగట్టుకొని రాజకీయం చేస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం ఐనవోలులోని కేజీబీవీలో ఆయన చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. బడులు కడితే విద్యావంతులు, గుళ్లు కడితే బిచ్చగాళ్లు అవుతారని అంబేడ్కర్ చెప్పిన మాటలే తాను చెప్పినట్లు పేర్కొన్నారు. దీన్ని కొందరు రాజకీయం చేస్తూ.. తన వ్యాఖ్యలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తాను కరుడుగట్టిన హిందువునని, అలాగే అంబేడ్కర్‌ను అమితంగా ఇష్టపడుతూ.. ఆయన ఆశయ సాధనకు కృషిచేసే వారిలో ఒకడినన్నారు. సమావేశంలో టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ ఛైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, నాయకులు మహేందర్‌గౌడ్, శ్రీపాద సతీష్, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాపై విచారణ

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ధర్మసాగర్ నుంచి దేవునూర్‌కు వెళ్లే మార్గంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై మంగళవారం తహసీల్దార్ సదానందం, ఆర్ఐ కిరణ్ వెళ్లి పరిశీలించారు. ధర్మసాగర్ శివారు 427/1, 428/2, 429, 445 లో 0-24 సర్వే నెంబర్లలో మొత్తం ప్రభుత్వ భూమి 3.12 ఎకరాల్లో కొందరు కొంత పట్టా చేసుకున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. ఈ నెల 3న దీనిపై పూర్తిస్థాయి విచారణ చేస్తామని, సమీప రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలతో రావాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, శాంతి సాగర్, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరిదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచన మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటయ్య తెలిపారు. బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేలమంది మహిళలు బతుకమ్మలతో రానున్న నేపథ్యంలో విద్యుత్తు దీపాలు, పారిశుద్ధ్య చర్యలు, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు, గోడపత్రికలను ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఈవో వెంకటయ్య, ఆధ్యాత్మికవేత్త మాడిశెట్టి రాజ్‌కుమార్, గంగ్రాతి రాజు, అర్చకులు మంగళవారం ఆవిష్కరించారు. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా పాటలు పాడే మహిళలకు, ఉత్తమ బతుకమ్మలకు రాధేశ్యాం సాహితీసంస్థ ఆధ్వర్యంలో ఎంపీ కడియం కావ్య చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామని అర్చకులు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

మడికొండ, న్యూస్‌టుడే: మడికొండ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిధులను ఈఓ శేషభారతి దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన పల్లపు అశోక్ మంగళవారం హైదరాబాద్‌లో దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మెట్టుగుట్టపై రూ.18లక్షలతో చేపట్టిన పనులను ఈఓ తనకు తెలిసిన వారికి కాంట్రాక్టు ఇచ్చారని, పనులు నాసిరకంగా చేశారని ఆరోపించారు.

కోదండ రాముని ధనస్సు


వరంగల్ బాలానగర వేంకటేశ్వరాలయంలో..

రామన్నపేట, న్యూస్‌టుడే: అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన కోదండ రాముని 'ధనస్సు'ను మంగళవారం వరంగల్ బట్టలబజారు బాలానగర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంచారు. దర్శనం చేసుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. 13 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో తయారు చేసిన విల్లును 2025 మార్చి నెలలో అయోధ్యలోని కోదండ రాముని చేతిలో ప్రతిష్ఠించనున్నట్లు సీతారామ సేవా ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ ఏలపాటి రత్నాకర్‌రెడ్డి, ఛైర్మన్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చివేయడం తగదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : హైడ్రాపై ప్రజలు ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో దాని పరిధి, పరిమితిపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా మొదట బడాబాబుల ఆక్రమణలు కూల్చివేసినప్పుడు ప్రజామోదం లభించిందని, తరవాత పేదల ఇళ్లు కూలుస్తుండటంతో అభిప్రాయ మారిందన్నారు. హైదరాబాద్ నగరంలో పేదల ఇళ్లు కూల్చడం తగన్నారు. సమావేశంలో నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జ్యోతి, భిక్షపతి, కర్ణాకర్, పంజాల రమేష్, సారగంపాణి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో మహా రక్తదాన శిబిరం


రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న కలెక్టర్ ప్రావిణ్య, రెడ్‌క్రాస్ ఛైర్మన్ విజయచందర్ రెడ్డి తదితరులు

సుబేదారి, న్యూస్‌టుడే: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్‌లో చికిత్స పొందుతున్న థలసీమియా బాధితుల కోసం మంగళవారం మహా రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ ప్రావిణ్య ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. రెడ్‌క్రాస్, యువ నేతాజీ ఫౌండేషన్, అహ్మదీయ ముస్లిం యూత్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. 50 మంది రక్తదానం చేశారు. వారికి కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువీకరణపత్రాలను అందించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థ, యువజన సంఘం సభ్యులు అరుణ్‌కుమార్, కన్నె రాజు, శివకుమార్, మహ్మద్ అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజీనామా చేయాలని ధర్నా


భాజపా నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఐనవోలు, న్యూస్‌టుడే: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు రాజీనామా చేయాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఐనవోలు నంది సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. భాజపా కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి మాట్లాడుతూ. . గుళ్లకు వెళ్తే బిచ్చగాళ్లుగా తయారవుతారని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. నాయకులు తిరుపతిరెడ్డి, రాజేంద్రప్రసాద్, బాల్య మహేశ్‌గౌడ్, పొన్నాల రాజు, తిరుపతి, మహేశ్వర్‌గౌడ్, కొట్టం రాజు, వెంకటనారాయణ, కుమారస్వామి, ప్రభాకర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై విచారణ

కమలాపూర్, న్యూస్‌టుడే: కమలాపూర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం మీస రాజమల్లయ్యపై ఎంఈవో రాంకిషన్ రాజు విచారణ చేశారు. జీహెచ్‌ఎం తనను మానసికంగా వేధిస్తున్నారంటూ అదే పాఠశాలకు చెందిన జూనియర్ సహాయకురాలు శారద ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ సూచన మేరకు డీఈవో వాసంతి విచారణకు ఆదేశించారు. మంగళవారం ఎంఈవో పాఠశాలలో ఉపాధ్యాయుల సమక్షంలో జీహెచ్‌ఎం, జూనియర్ అసిస్టెంటుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అందరి నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. నివేదికను డీఈవోకు అందజేస్తామని ఎంఈవో తెలిపారు.



పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కమలాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పల్ గ్రామం నుంచి రోజూ రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వస్తున్న జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్నారైలు సైకిళ్లు అందించారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని అమెరికాలో ఉంటున్న ఉప్పులపల్లి గ్రామానికి చెందిన ఎర్రబెల్లి విఠల్‌రావు, విజయ్ మన్మోహన్‌రావు ఆర్థిక సాయంతో వితరణ తొమ్మిది సైకిళ్లను అందజేశారు. మంగళవారం ఎంఈవో రాంకిషన్‌రాజు, హెచ్‌ఎం వాణి, ఏపీపీ ఛైర్మన్ రాధ, నాయకులు సంపత్‌రావు, శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు వాటిని విద్యార్థులకు అందించారు.

కిట్స్‌లో సంశోధిని-2024 గోడ పత్రికల ఆవిష్కరణ



ముచ్చర్ల (హసన్‌పర్తి), న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18, 19వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం (సంశోధిని-2024) కార్యక్రమ గోడపత్రికను మంగళవారం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను పంచుకోవడానికి, నేర్చుకోవడం కోసమే ఈ కార్యక్రమం అన్నారు. దీనిలో పాల్గొనాలనుకున్న ఇంజినీరింగ్ విద్యార్థులు www.sumshodhini.kitsw లేదా kitsw.ac.in- వెబ్‌సైట్‌లో ఈ నెల 5లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రోగ్రాం కన్వీనర్ ఎం.నర్సింహారావు, టి.మధుకర్‌రెడ్డి, ఎస్.సునీల్, ప్రతాప్‌రెడ్డి, బి.విజయ్‌కుమార్, డి.ప్రభాకరాచారి, బి.బద్రీనారాయణ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


విద్యార్థులతో అనుజ్ అగర్వాల్, వెంకట్రామారెడ్డి, నారాయణరెడ్డి, సరితారెడ్డి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని అటవీశాఖ అధికారి అనుజ్ అగర్వాల్ తెలిపారు. మంగళవారం రంగశాయిపేట శివారులోని 'ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి నాయకులుగా నియమితులైన విశాల్, గోలి నిక్షిత, ఇతర విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రొఫెసర్ బి.వెంకట్రాంరెడ్డి, నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సరితారెడ్డి పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



భీమదేవరపల్లి: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు.

బలియాలో దొంగల బెడద

కార్పొరేషన్, న్యూస్‌టుడే: బల్దియా ప్రధాన కార్యాలయాన్ని దొంగల భయం వెంటాడుతోంది. అయిదురోజుల క్రితం సాయంత్రం వేళ ఇనుప గ్రిల్స్ ఎత్తుకెళ్లేందుకు వచ్చిన దొంగను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మరువకముందే సోమవారం అర్ధరాత్రి దుండగులు 'గ్రీనరీ లాన్' చుట్టూ ఉన్న పిట్ట గోడ కూల్చేసి కొత్తగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ అపహరించారు. మంగళవారం ఉదయం విషయం వెలుగులోకి వచ్చింది.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన దర్గా కాజీపేటలో మంగళవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. దర్గా కాజీపేటకు చెందిన నెలికంటి రాకేష్ (35) ఓ ఫైబర్ నెట్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వచ్చే వేతనం చాలక ఆర్థికంగా ఇబ్బందులు నెలకొనడంతో సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రేపటి నుంచి సార్వత్రిక పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 3 నుంచి 9 వరకు నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి శంకర్‌రావు తెలిపారు. మంగళవారం పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు.

3న బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా బాక్సింగ్ ఎంపిక పోటీలు హనుమకొండ జేఎన్ స్టేడియం బాక్సింగ్ హాలులో ఈ నెల 3న ఉంటాయని నిర్వహణ కార్యదర్శి రాజేందర్ తెలిపారు. జూనియర్, సబ్‌జూనియర్ విభాగాల్లో నిర్వహించే పోటీలకు ఆసక్తి ఉన్న బాలబాలికలు హాజరుకావాలన్నారు. ఎంపికైన బాక్సర్లు ఈ నెల 5, 6న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

చింతగట్టు (భీమారం), న్యూస్‌టుడే: ప్రైవేట్ పాఠశాలకు సంబంధించిన ఆదాయం లెక్కలు చూసుకుందామని పిలిచి డైరెక్టర్‌పై దాడి చేశారని కేయూ ఎస్సై రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల డైరెక్టర్లు అయిదుగురు సోమవారం హనుమకొండ మండలం గోపాలపూర్‌లోని ఓ ఇంట్లో కూర్చొని మాట్లాడుకుంటుండగా ఎవారి మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. లెక్కల గురించి గట్టిగా నిలదీసిన చంద్రశేఖర్‌ను చేతులు కట్టేసి మిగిలిన నలుగురు దాడిచేసి కర్రతో కొట్టారు.

బాలికను గర్భవతిని చేసిన వృద్ధుడు

గీసుకొండ: అభం శుభం తెలియని పన్నెండేళ్ల బాలికను ఓ వృద్ధుడు గర్భవతిని చేసిన ఉదంతం ఇది. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో మంగళవారం ఈ దురాగతం వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) ఇంటి పక్కనే ఉంటున్న 12 ఏళ్ల బాలికపై కన్నేశాడు. బాలిక తండ్రి కొద్ది రోజుల క్రితం మృతిచెందగా తల్లి ఆమె తన ఇద్దరు కొడుకులను, కూతురు(12)ను వదిలేసి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అన్నదమ్ములతో కలిసి ఉంటున్న బాలికపై సాంబయ్య కన్ను పడింది. సోదరులు లేని సమయంలో సాంబయ్య బాలికకు మాయమాటలు చెప్పి ఆమెను లోబరుచుకుని గర్భవతిని చేశాడు. ఇటీవల ఇంటికి వచ్చిన తల్లికి బాలిక ఈ విషయం చెప్పడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వరంగల్‌లోని సీకేఎం ఆసుపత్రిలో మంగళవారం బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో నాలుగు నెలల గర్భవతని వైద్యులు నిర్ధారించారు. బాలికను వసతి గృహానికి తరలించి పోలీసులు సాంబయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల సత్తా


విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

దామెర, న్యూస్‌టుడే: ఒగ్లాపూర్ మహాత్మా జ్యోతిబా పులే గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల హనుమకొండలో నిర్వహించిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటినట్లు ప్రిన్సిపల్ యాదగిరి మంగళవారం తెలిపారు. అండర్- 14, 16, 18, 20 విభాగాలలో రోహిత్, భరత్, నాగేష్, శ్రీకాంత్, పవన్, కమలాకర్, రవి, అభిలాష్, మనోజ్, విద్యాకర్, గణేష్, సాయికుమార్, కార్తిక్, హర్షన్‌యాదవ్, అర్జున్‌లు ప్రతిభ కనబరిచి, బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు వి.మౌనిక, టి.మనోజ్‌కుమార్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ గ్రేసమ్మ మంగళవారం తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు పుల్ల నిర్మల కుమారి, పీడీ గ్రేసమ్మ విద్యార్థులను అభినందించారు.


వి.మౌనిక


టి.మనోజ్‌కుమార్

పోషణ చట్టం వృద్ధులకు వరం


వృద్ధుడిని సన్మానిస్తున్న ఆర్డీవో నారాయణ

పరకాల నియోజకవర్గం

పరకాల, న్యూస్‌టుడే: పోషణ చట్టాన్ని వయోవృద్ధులు సద్వినియోగపర్చుకోవాలని పరకాల ఆర్డీవో కె.నారాయణ సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం పరకాలలో వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింహరాములు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక మార్పుల దృష్ట్యా వృద్ధులైన తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కలెక్టర్ స్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ చట్టం అమలవుతుందన్నారు. బాధితులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో సమస్యను పరిష్కరించే అవకాశాలున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆస్తుల రిజిస్ట్రేషన్, వీలునామా రాయించుకున్న అనంతరం పిల్లలు ఇబ్బందులకు గురిచేసినట్లయితే వాటిని రద్దుచేస్తారన్నారు. అనంతరం వయోవృద్ధులైన పావుశెట్టి వైకుంఠం, చందుపట్ల జంగారెడ్డిలను శాలువాలతో సత్కరించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్, సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసచారి, కైలాసం, సంపత్, కల్యాణి, రామన్న తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భద్రయ్య



పరకాల, న్యూస్‌టుడే: పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పెండెల భద్రయ్య నియమితులైనట్లు ఎన్నికల అధికారి ఒంటేరు రాజమౌళి తెలిపారు. మంగళవారం ఇక్కడ జరిగిన సమావేశంలో భద్రయ్య పేరును ఆయన ప్రకటించారు.

పద్మ బ్రాహ్మణులకు గుర్తింపు కార్డులివ్వాలి

శాయంపేట, న్యూస్‌టుడే: పద్మ బ్రాహ్మణులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను అందజేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మలిపెద్ది కృష్ణశాస్త్రి కోరారు. శాయంపేట శివమార్కండేయ, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం మార్కండేయ వ్రతాన్ని నిర్వహించారు. గజ్జల ఓంకార్ శాస్త్రి, మార్త రాజ్‌కుమార్, తౌటం శ్రీనివాస్, విద్యాసాగర్, భిక్షపతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ట్రాలీ దగ్ధం

శాయంపేట, న్యూస్‌టుడే: మండలంలోని మాందారిపేట శివారులోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల సమీపంలో విద్యుదాఘాతంతో ట్రాలీ ఆటో దగ్ధమైంది. పరకాలలోని ఓ ప్రైవేట్ టైర్ల కంపెనీలో టైర్లను దింపి హసన్‌పర్తికి వెళుతున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్ సతీష్‌కు ప్రాణాపాయం తప్పింది. వెంటనే పరకాల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. శాయంపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు అయిన **ఆలకుంట రాజు,** తండ్రి: కీ.శే. మల్లయ్య, నివాసం: ఇ.నెం. 19-9-450/1/ఎ, శ్రీరామ్‌నగర్ కాలనీ, శంభునిపేట, వరంగల్ గారి తరఫున సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా షెడ్యూల్ దాఖలా ఆస్తి నా క్లయింటు అయిన **ఆలకుంట రాజు** మరియు వారి తమ్ముళ్లు అయిన **ఆలకుంట సంపత్, ఆలకుంట సంతోష్** వారి చెల్లి అయిన **శివరాత్రి స్వప్న గార్లకు** వారి తండ్రి గారైన ఆలకుంట మల్లయ్య గారి ద్వారా సంక్రమించినది. షెడ్యూలు దాఖలా ఆస్తి విషయమై సదరు సంపత్, సంతోష్ మరియు స్వప్నలు నా క్లయింటుకు నష్టము కలిగించాలనే ఉద్దేశ్యముతో తప్పుడు దస్తావేజులు సృష్టించి షెడ్యూలు దాఖలా ఆస్తిని అన్యాక్రాంతము చేయుటకు ప్రయత్నము చేయుచున్నారని తెలియవచ్చినది.

కావున షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరైనను సదరు **ఆలకుంట సంపత్, ఆలకుంట సంతోష్ మరియు శివరాత్రి స్వప్న గార్లతో** కానీ వేరే ఎవ్వరితో కానీ ఎటువంటి లావాదేవీలు చేయకూడదనియు ఒకవేళ చేసిన చెల్లనేరదనియు మరియు నా క్లయింటు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియచేయనైనది.

షెడ్యూలు

వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలము, శివనగర్‌లోని 310 చ.గ.ల ఇల్లు మరియు ఖాళీ స్థలము ఇ.నెం. 16-10-1320, ఈ క్రింది హద్దులలో గలది. **తూర్పు:** నాగలక్ష్మి గారి ఇల్లు, **పడమర:** 40 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** రాయిలా సమ్మయ్య గారి ఇల్లు, **దక్షిణం:** పానుగంటి కొమురయ్య గారి ఇల్లు.

ఇట్లు సం/- **బిళ్ళ ప్రభాకర్,** న్యాయవాది
ఇ.నెం. 19-11-387/4, విశ్వనాథ కాలనీ, శంభునిపేట, వరంగల్ 9848872545